TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసల్లైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 1 | సంచిక :128 | prajadivvs57@gmail. com | ఆదివారం 8, మార్చి 2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 4 | వెల : 3/-

## ట్రంప్ తదితరుల హత్యకు ప్లాన్

- ఇరాన్ ప్రోద్బలంతో రంగంలోకి ఆసిఫ్ మర్చంట్
- పాకిస్థానీని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు



## రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు

### మూడు పంటలకని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వరా

### కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు.





## మహిళల రక్షణ సమాజం బాధ్యత

మహిళా వేధింపులను నిలదీసే సమాజం రావాలి

### వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం



### ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు

### స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సీఎం రేవంత్

మహిళల రక్ష ణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కా ర్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పా ల్గొన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వె య్యి బస్సులకు మహిళలే యజ మానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు.

.. వివరాలు 2లో

### లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత

130 మంది మావోయిస్టులు లొంగుబాటు

గణపతి కూడా లొంగిపోవాలన్న సీఎం

శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు.



### బీర్ బాటిల్‌లో చేపపిల్ల

.. వివరాలు 2లో

### వ్యభిచార ముఠా ఆటకట్టు

.. వివరాలు 2లో



## హైదరాబాద్ కేంద్రంగా

### ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణలు

మంత్రి శ్రీధర్ బాబు

కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ఓల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



## వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ నిధులు

నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ

ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులు

మంత్రి తుమ్మల





## 99రోజుల్లో లక్ష్యాలను చేరుకోవాలి

### హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి

### పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

2




# హైదరాబాద్ కేంద్రంగా

## ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణలు

### మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

: కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ఓల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేస్తోంది. ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతోంది. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా అభివృద్ధి చెందింది. వ్యాన్ గార్డ్, యుబిఎస్ , వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్ , గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటీ రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐకేఏఎం లను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని మంత్రి అన్నారు. డిజిటల్ యుగంలో సీఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారింది కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గనిర్దేశర చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్ బాబు, ఫిక్కి సిఎఫ్ ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ జిష్ణుదేవ్‌తో భట్టి భేటీ



మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మని లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్ప గుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలను పంచుకున్నారు. అలాగే ఇంతకాలం తెలంగాణ గవర్నర్గా ఇక్కడి అభివృద్ధిలో భాగమైనందుకు అభినందించారు. ఇటీవలి మార్పుల్లో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా వెళుతున్నారు. తెలంగాణకు శుక్లా రానున్నారు.

# కూకట్‌పల్లిలో వ్యభిచార ముఠా ఆటకట్టు

కూకట్‌పల్లిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను శనివారం సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వ్యభిచార ముఠా నిర్వహిస్తున్న ఇద్దరితో పాటు మరో అయిదు మంది కస్టమర్లను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు మహిళలను రెస్క్యూ చేసినట్లు చెప్పారు. ఓ సమాచారం ఆధారంగా సైబరాబాద్‌కు చెందిన ఏహెచ్‌టీయూ బృందం రెయిడ్ నిర్వహించింది. సుమిత్రానగర్‌లో ఉన్న ఇండ్లపై దాడి నిర్వహించారు. రాకెట్ నడుపుతున్న వారితో పాటు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కస్టమర్లను ఆకట్టుకుంటున్నట్లు గుర్తించారు. వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూల్ చేస్తున్నట్లు తేల్చారు. భారీ మొత్తంలో డబ్బు వసూల్ చేసినా.. బాధితులకు మాత్రం తక్కువే ఇస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

# బీర్ బాటిల్‌లో చేపపిల్ల



బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. బీర్ బాటిల్‌లో ఓ చేపపిల్ల ఈదుతూ కనిపించింది. హైదరాబాద్ నాచారం పరిధిలోని మల్లాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో ఓ వ్యక్తి శుక్రవారం నాడు కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దాన్ని తాగేందుకు మూత ఓపెన్ చేయగానే అందులో చేప పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన కస్టమర్.. వెంటనే షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. అయితే అతనితో వైన్ షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. బీర్లు తాము తయారుచేయమని.. ఏదైనా ఉంటే తయారుచేసిన కంపెనీని అడుక్కోవాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో బీర్ బాటిల్‌లో చేప కదలడాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.

# మహిళల రక్షణ సమాజం బాధ్యత

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భహంగా మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలని సీఎం సూచించారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసి విద్యుత్ శాఖకు అమ్మే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయంతో మహిళలు అదానీ, అంబానీల స్థాయిలో విద్యుత్ రంగంలో పోటీ పడే అవకాశం ఇచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారి స్వేచ్ఛ పెరిగిందని సీఎం తెలిపారు. జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించి మహిళల చేతుల్లో పెట్రోల్ బంకులు





నిర్వహించే అవకాశాలు ఇచ్చామన్నారు. దేశంలోనే తొలిసారి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టింది తెలంగాణ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ సహా కీలక అధికార పదవుల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదే అని అన్నారు. మహిళల శక్తి, నైపుణ్యంపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.మహిళల రక్షణను సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం బలపడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగితే నిలబడి ప్రశ్నించే ధైర్యం సమాజంలో రావాలన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా జరిగే వేధింపు లను చూసీ చూడనట్టు ఉండడం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై సైబర్ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి దుర్గతేజ్ తదితరులు పాల్గొన్నారు.

# లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత

### 130 మంది మావోయిస్టులు లొంగుబాటు

### గణపతి కూడా లొంగిపోవాలన్న రేవంత్

**ప్రజానావ, హైదరాబాద్:** శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. ాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి కూడా లొంగిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించాలని అమిత్ షా చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు. పూర్తి వివరాలు వీడియోలో చూడండి.

### ఆయుధాలను అప్పగించిన మావోలు

తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఇప్పటి వరకు తెలంగాణ పోలీసులు ముందు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మావోయిస్టుల నుంచి పోలీసులు ఇప్పటి వరకు 266 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 7 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. 124 తుపాకులు, 5205 తూటాలతో సహా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. మావోయిస్టులు సరెండర్ చేసిన ఆయుధాలలో రైఫిళ్లు ఇతర తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఇక, లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతి ఇస్తోంది. తెలంగాణ ప్రభుత్వం జనజీవన స్రవంతిలో కలిసిపోయిన డివిజనల్ కమిటీ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు, ఏరియా కమిటీ సభ్యులకు నాలుగు లక్షల రూపాయలు, పార్టీ సభ్యులకు లక్ష రూపాయలు నగదు బహుమతి ప్రకటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఆయుధాలతో సహా జనజీవన స్రవంతిలో కలుస్తున్న క్యాడర్లకు అదనంగా ప్రోత్సాహకాలు అందనున్నాయి.

# 99 రోజుల్లో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

- హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి
- పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




ప్రజాపాలన– ప్రగతి నివేదిక

99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్ధేశిరచుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ప్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని ఇందులో కొంతమంది అసలు మరికొంతమంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల గడువు ముగిసిపోయిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని ఈసందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు.దీనిపై మంత్రిగారు స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు. టాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ మరియు ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చు.డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేర–ువవుతాయి. ఇది హౌసింగ్ బోర్డు మరియు అలాటీల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

### దానం , కడియంలపై తీర్పు రిజర్వ్



తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు చివరిదశకు చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం తుది విచారణను ముగించారు. సుప్రీ కోర్టు విధించిన గడువు శనివారంతో ముగియనుండటంతో, స్పీకర్ వెలువరించబోయే తీర్పుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్లపై దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ఛాంబర్ లో కీలక విచారణ జరిగింది. ఇప్పటికే పదిమంది ఎమ్మెల్యేలను ప్రశ్నించారు స్పీకర్, అనంతరం 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చారు. దానం, కడియం కేసులో తీర్పు రిజర్వ్ ఉంచారు. ఉభయ పక్షాల వాదనలు విన్న అనంతరం ఈ కేసులో కూడా విచారణ ముగిసినట్లు స్పీకర్ కార్యాలయం ప్రకటించింది.

# మహిళా రిజర్వేషన్లు గౌరవించాలి. మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి

**-మహిళల ఉపాధిని దెబ్బతీసే వి.బి.జి. రామ్ జీ పథకాన్ని వ్యతిరేకించండి**

**-ఎగ్లాస్పూర్ గ్రామ సర్పంచ్ కామ్రేడ్ జూపాక మమత**

**-కోడిపుంజుల లక్ష్మి పి ఓ డబ్ల్యు రాష్ట్రనాయకురాలు పిలుపు**



**గోదావరిఖని, మార్చి 07ప్రజా దివాస్** అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ఎగ్లాస్పూర్ గ్రామ సర్పంచ్ కామ్రేడ్ జూపాక మమత, పి ఓ డబ్ల్యు తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి హాజరై మాట్లాడుతూఅంతర్జాతీయ మహిళా పోరాట దినం మార్చి 8 అంటే దీనికి కొంత ప్రాధాన్యత ఉన్నది. ఒక ఒక చారిత్రా చారిత్రాత్మక పోరాటాల నేపథ్యం ఉన్నది. కానీ ఇదోక పండుగ కాదు. సంబరాలు, సన్మానాలు చేసుకోవడం అంతకంటే కాదు. న్యూయార్క్ నగరంలో పరిశ్రమలలో పని చేసే మహిళా కార్మికులు పని గంటల తగ్గింపుకు, శ్రమదోపిడికి వ్యతిరేకంగా వేతనాల పెరుగుదల కోసం పోరాడి హక్కులు సాధించుకున్న రోజు. హక్కుల సాధన కోసం మహిళలు రక్తతర్పణలు చేసిన రోజు. జరుపుకోవాలని 1910 1908 మార్చి 8న " ప్రపంచ మహిళల పోరాట దినంగా " సంవత్సరం కోపెన్హెగెన్ లో జరిగిన మహా సభలో జర్మనీ కమ్యూనిస్టు నాయకురాలు క్వారా జెట్కిన్ ప్రతిపాదించి ఆమోదింపచేసినారు. ఈ మధ్యకాలంలో మహిళా రిజర్వేషన్ స్థానాల్లో గెలిచిన చోట మహిళా ప్రతినిధులను కేవలం సంతకాలకే పరిమితం చేస్తున్న పరిస్థితి ఉన్నది. అధికారిక కార్యక్రమాల్లో కూడా వారి కుటుంబ సభ్యుల ఆధిపత్యం కనబడుతున్నది మహిళా రిజర్వేషన్లు గౌరవించవలసిన బాధ్యత పాలకులపై ఉన్నది. మహిళల్లో అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కేవలం పుస్తకాల ప్రజాప్రతినిధులుగా మార్చకుండా విధాన నిర్ణయాల్లో సైతం మహిళలు భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము

మోడి అధికారములోకి వచ్చిన తర్వాత దేశంలో కార్మిక వర్గం, ప్రజలు, మహిళల సమస్యలు మరింతగా పెరిగినాయి. వీరి హక్కులపై దాడికి పూనుకున్నది. కార్మిక చట్టాలను రద్దుచేసినది. నాలుగు లేబర్ కోడ్స్ మార్చి హక్కులను హరించి వేసింది. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, అసంఘటిత రంగాలలో దాదాపు 50% మంది మహిళలు పని చేస్తున్నారు. వీరికి ఉద్యోగ, ఉపాధి భద్రత లేదు. వేతనాలలో కూడా వివక్షతను ఎదుర్కొంటున్నారు. సుప్రీంకోర్టు ఎన్ని ఆదేశాలు ఇచ్చిన పాలకులు అమలు చేయడం లేదు. గత 10 సం॥రాలుగా బి.జె.పి. మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నేపథ్యమే మహాత్మగాంధీ ఉపాధి హామీ చట్టం పేరును మార్చడం. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా వి.బి.జి. రాంజీ పథకాన్ని పార్లమెంట్లో ఆమోదించినది. ఉపాధి హామీ చట్టాన్ని ఎందుకు రద్దు చేశామంటే లోపాలు ఉన్నాయని పాలకులు సమర్థించుకుంటున్నారు. లోపాలు ఉంటే సరిచేయాలని కానీ, రద్దు చేయడం పరిష్కారం కాదు. ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని పని దినాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నాము. లిఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు అడేపు శంకర్, ఈసంపల్లి రాజేందర్, మార్త రాములు గొల్లపల్లి చంద్రయ్య, పి వో డబ్ల్యూ జిల్లా నాయకురాలు, పెద్దంపేట గ్రామం మాజీ సర్పంచ్ మార్త రాధ, కొట్టే స్వరూప, పెంద్యాల లక్ష్మి, ఆడెపు సత్తక్క తో పాటు 100 మంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వ్యాధితో మహిళ మృతి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ/ మార్చి 07 ప్రజా దివాస్** వేములవాడ పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని 20వ వార్డుకు చెందిన మున్సిపల్ కార్మికుడు ఎదురుగట్ల వినోద్ భార్య ఆకాంక్ష గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మృతురాలికి రెండు నెలల పసికందు ఉండటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తక్షణమే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వినోద్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆ భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మున్సిపల్ కార్మికుని కుటుంబానికి ఎదురైన ఈ కష్టం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



# శాత్రాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా యూనిఫాంల పంపిణీ...

**- పాల్గొన్న కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి దంపతులు**



**వేములవాడ/మార్చి 07 ప్రజా దివాస్** వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయా ్యరు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అన్నప్రాసన మరియు అక్షరాభ్యాస కార్యక్రమాలను ఆమె స్వయంగా నిర్వహించారు. అనంత రం కేంద్రంలోని విద్యార్థులకు కౌన్సిలర్ చేతుల మీదుగా యూనిఫాంలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డిని అంగన్‌వాడీ టీచర్లు మరియు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**వేములవాడ /మార్చి 07 ప్రజా దివాస్** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. శనివారం వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో 14వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుత ుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, విలువలను అలవరుచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో దేశానికి సేవ చేసే బాధ్యతా యుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు..విద్యార్థులు తల్లిదండ్రులు తమ పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరా లను అధిరోహించాలని పేర్కొన్నారు.. ఉపాధ్యాయులు విద్యార్థుల లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు..విద్యార్థి దశలో కలలు కనాలని.. వాటిని ఇష్టంతో మంచిగా చదివి సాకారం చేసుకోవాలని సూచించారు. పరీక్షల్లో విదా ్యర్థులు ఉత్తమ ప్రతిభ చూపాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేశారని తెలిపారు.. ఈ విద్యాలయంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. యువత కోసం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ప్రారంభించిందని విప్ తెలిపారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా విధానంపై సమూల మార్పులు తీసుకువస్తున్నారని అందులో భాగంగా నూతన విద్య కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తరహాలో నూతన పాఠశాలలను నెలకొల్పడం జరుగుతుందని తెలిపారు..



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**- సర్పంచ్ కంచరి సైదమ్మ**



**ఖమ్మం ప్రతినిధి మార్చి 7 ప్రజా దివాస్** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యం వహించరా దని నాయకన్ గూడెం గ్రామ సర్పంచ్ కంచరి సైదమ్మ తెలిపారు. శనివారం కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామం లోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి లో తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలి అని అన్నారు. మధ్యాహ్నం భోజనం ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులను మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు భోజనం వడ్డించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

# మహా విజ్ఞాపన సభకు జిల్లా ఉపాధ్యాయులు




**ఆసిఫాబాద్, మార్చి 07,ప్రజా దివాస్** 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హైద్రాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద ఈ రోజు మహావిజ్ఞాపన సభ నిర్వహించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం 55/4,55/5 మెమో ద్వారా 1-9-2004 కంటె ముందు నియామకం ప్రక్రియ పూర్తి అయిన ఉద్యోగ ఉపాధ్యాయులందరికి పాతపెన్సన్ వర్తింపచెయ్యాలి అని సూచించింది. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ 2003 డియస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాలని 5 నెలల క్రితమే తీర్పు ఇచ్చినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఏ చర్యలు తీసుకోవడం లేదనే తీవ్ర ఆవేదన తో తెలంగాణ లోని 33 జిల్లా ల నుండి వేలాది ఉపాధ్యాయులు తరలివచ్చారు దీనికి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుండి ఉపాధ్యాయులు రాజశేఖర్, సాదుల సంతోష్ కుమార్,జగదీష్, లక్ష్మన్, శశికాంత్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, మహేష్ పాల్గొన్నారు.

# రాజన్న క్షేత్రంలో మూడవరోజు వైభవంగా శివకళ్యాణ మహోత్సవాలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ/ మార్చి 07 ప్రజా దివాస్**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శివకళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ఉదయం నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మండప ఆరాధన, ఆవాహిత హోమం, ఔపాసనం మరియు బలిహరణం వంటి వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. రాత్రి సమయంలో సదస్యం, ఔపాసనం, బలిహరణం కార్యక్రమాల ను నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అర్చకులు ఈ పూజా కార్యక్రమాలను ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంతో వేములవాడ క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది

# రైతుల పంట పొలాలకు నీటి విడుదల





**వేములవాడ/ మార్చి 07 ప్రజా దివాన్** వేములవాడ పట్టణంలోని గుడి చెరువు తూము నుండి వేములవాడలో గల పంట పొలాలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో అధికారులు నీటిని విడుదల చేశారు..ఈ సందర్భంగా మిడ్ మానేరు నుండి చెరువులోకి నీటిని లిఫ్ట్ చేయాలని, అలాగే గుడి చెరువు నుండి లక్ష్మీపూర్ పంట పొలాలకు నీటిని విడుదల చేయాలని అధికారులకు ప్రభుత్వ విప్ ఆదేశాలు జారీ చేశారు

# చందుర్తి: ఆసిరెడ్డిపల్లి పాఠశాలలో ఘనంగా “అమ్మకు వందనం”

### - అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని తల్లులకు సన్మానం






**చందుర్తి / మార్చి 07 ప్రజా దివాన్** చందుర్తి మండలం ఆసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా “అమ్మకు వందనం” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ తల్లులకు పుష్పాలు ఇచ్చి పాదాలకు వందనం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు ఆత్మనూన్యత భావాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరుమల మరియు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాల్వ శ్రీరాంపూర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### మహిళా పోలీసులకు సన్మానం



**కాల్వ శ్రీరాంపూర్ మార్చి 7 (వెలుగునిఘా)** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మహిళ పోలీసులు ఏ ఎస్ ఐ నీలిమ, కానిస్టేబుల్ రజిని, నాగజ్యోతి కి మండల కేంద్రానికి చెందిన కుంట శ్రీకాంత్, తాత సాయికిరణ్ యాదవ్, దండి సాయికుమార్, కత్తుల మహేష్ శాలువాతో సన్మానించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల హక్కులు విజయాలు సమాజంలో వారు కీలక పాత్రను స్మరించుకున్నారు స్త్రీ పురుష సమానత్వం మహిళ సాధికారికతను ప్రోత్సహిస్తూ అవకాశాల్లో సగం అనే నిదానంతో మహిళను గౌరవించాలన్నారు వారి కలలను సహకారం చేసుకోవడానికి మద్దతుగా నిలవాలని తెలిపారు సమాజంలో మహిళల శ్రమ త్యాగం వారి గొప్పతనాన్ని గుర్తు చేశారు స్త్రీ లేకపోతే జననం లేదు స్త్రీ లేకపోతే గమనం లేదన్నారు స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదన్నారు తల్లిగా సోదరిగా భార్యగా కుమార్తెగా కుటుంబానికి వెన్నుముకగా నిలపడమే కాకుండా విద్య వైద్యం వ్యాపారం అంతరిక్షం రాజకీయం ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను కనబరచాలన్నారు పురుషులతో సమానంగా మహిళలకు కూడా అవకాశాలు హక్కులు గౌరవం దక్కాలని ఈ సందర్భంగా తెలిపారు

# అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయం

**కక్షిదారులకు సత్వర న్యాయం సౌలభ్యాలు**
**రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్**
**సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన కోర్టు బిల్డింగ్ సముదాయానికి నిర్మాణానికి భూమి పూజ**
**వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి**
**కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయ మూర్తులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ**



**రాజన్న సిరిసిల్ల, మార్చి – 07 ప్రజా దివాన్** కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయాలు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ తెలిపారు. సిరిసిల్లలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో 12 రకాల న్యాయస్థానాలు సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు శైలిలో నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన లో పాల్గొనగా, సిరిసిల్లలో హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వ మత ప్రార్ధనలు చేసి.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నూతన కోర్టు భవన సముదాయం అన్ని కోర్టుల నిర్వహణకు సరిపోయే విధంగా ఉంటుందని వెల్లడించారు. నూతన కోర్టులో మౌలిక వసతులతోపాటు తగినంత సిబ్బంది ఉండాలని సూచించారు సిరిసిల్ల జిల్లాకు భౌగోళికంగా, పరిపాలన పరంగా ప్రాముఖ్యత ఉందని, వ్యవసాయం జీవనోపాధితో అభివృద్ధి చెందుతున్న జిల్లా అని పేర్కొన్నారు. ఇక్కడ చేనేత పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి పొందింది అని పేర్కొన్నారు. నూతన కోర్టు భవన సముదాయంతో కోర్టు కు వచ్చే కక్షి దారులకు సత్వర న్యాయం లభించాలని, ఈ దిశగా న్యాయవాదులు, న్యాయ మూర్తులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. జిల్లా కోర్టులో 13 వేల కేసులు పైగా కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు. పెండింగ్ కేస్ ల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సంబంధిత అధికారులు సమన్వయముతో పని చేయాలని ఆదేశించారు.

న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతంఈ నూతన కోర్టు భవన నిర్మాణం ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే కొత్త అధ్యాయానికి నాందిగా నిలుస్తుందని హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ పేర్కొన్నారు. రాజ్యాంగం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి పౌరుడికి సామాజిక న్యాయం అందేలా న్యాయవ్యవస్థ పని చేయాలన్నారు. ప్రతి పౌరుడు న్యాయస్థానాన్ని ఆశతో, నమ్మకంతో ఆశ్రయించేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కోర్టు భవనం నిర్మాణం ద్వారా మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందేలా అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాకుండా రాజ్యాంగ విలువలను కాపాడే న్యాయవ్యవస్థకు ఉన్న నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. నిష్పక్షపాతం.. నైతిక విలువలు కాపాడడం అత్యంత ముఖ్యమని ఆ దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, న్యాయ పరిపాలన, సమానత్వం, నాణ్యమైన న్యాయ సేవలు అందేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బార్ సభ్యులు సత్యాన్ని వెలికితీసే బాధ్యతతో పని చేస్తూ ప్రజలకు న్యాయం అందేలా అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు.సిరిసిల్ల జిల్లా సంపదకు కేంద్రం, చరిత్రకు నిలయం రాజన్న సిరిసిల్ల జిల్లా చరిత్ర, సంస్కృతి, పరిశ్రమలతో ప్రసిద్ధి పొందిన ప్రాంతం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ పేర్కొన్నారు పెద్ద టెక్స్టైల్ పవర్ లామ్ కేంద్రంగా ఎదిగి వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు. సిరిసిల్లను పవర్లూమ్ నగరంగా కూడా పిలుస్తారనీ. ఇక్కడ వేలాది మంది నేత కార్మికులు పగలు రాత్రి శ్రమించి దేశవ్యాప్తంగా పేరు పొందిన వస్త్రాలను తయారు చేస్తున్నారని తెలిపారు.సిరిసిల్లలో ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం దేశంలో ప్రసిద్ధి చెందిన పవిత్రక్షేత్రాలలో ఒకటి. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారనీ. ఈ ఆలయం ఈ ప్రాంతానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తెచ్చిపెట్టిందనీ తెలిపారు.సిరిసిల్ల జిల్లా ప్రత్యేకతల్లో నేత కార్మికుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఇక్కడి నేత కార్మికులు తయారు చేసే చీరలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లు, ఇతర వస్త్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, వేలాది కుటుంబాలు ఈ టెక్స్టైల్ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు.అందుకే సిరిసిల్లను చరిత్ర, ఆధ్యాత్మికత, పరిశ్రమలు కలిసిన సంపద నగరంగా పేర్కొంటారని గుర్తు చేశారు. తెలంగాణలో అభివృద్ధి, సంస్కృతి, కార్మికుల కృషికి ప్రతీకగా నిలిచిన సిరిసిల్ల ఒక ముఖ్యమైన జిల్లాగా ప్రఖ్యాతిగాంచిందని పేర్కొన్నారు.

**ల్యాప్ టాప్ లు పంపిణీ..**

జిల్లా సంక్షేమశాఖ ఆద్వర్యంలో దివ్యాంగ డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్లు, ఎంపవర్ కార్ట్ లు హై కోర్టు న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

**హైకోర్టు న్యాయమూర్తులకు సన్మానం**

అనంతరం హై కోర్టు న్యాయమూర్తులను జిల్లా కోర్టులు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధ్యులు, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, × వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి.బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల – కమ్ – ఛైూజ: కార్యదర్శి, ఋాూాూ శ్రీ.పి.లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి, వేములవాడ శ్రీ. అజయ్ కుమార్ జాదవ్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీ.ప్రవీణ్, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జ్యోతిర్మయి, సిరిసిల్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీమతి. కావేటి సృజన, మిస్.గడ్డం మేఘన, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ.గుడిసె సదానందం, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, గవర్నమెంట్ ప్లీడర్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ గౌరవం సమాజ అభివృద్ధికి పునాది






**ఖమ్మం ప్రతినిధి మార్చి 7 ప్రజా దివాన్** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలోని ఉమెన్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీ విద్య మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదు, స్త్రీ లేనిదే గమనం లేదు. ఒక చిన్నారిగా, సోదరిగా, భార్యగా, తల్లిగా, శక్తి స్వరూపిణిగా... ఇలా స్త్రీ జీవితంలో ఎన్నో పాత్రలు పోషిస్తూ, కుటుంబ బాధ్యతలను తన భుజాలపై మోస్తుంది అని, మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సమాజ అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని,మహిళలకు విద్య, ఆత్మవిశ్వాసం మరియు అవకాశాలు కల్పిస్తే వారు సమాజాన్ని ముందుకు నడిపించే శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ నేటి మహిళలు విద్య, సాంకేతికత, వ్యాపారం వంటి అనేక రంగాల్లో విశేష విజయాలు సాధిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఈ రోజు కేవలం శుభాకాంక్షలు చెప్పుకునే రోజు కాకుండా, మహిళల హక్కులతో పాటు, సమాజంలో వారికి ఉండాల్సిన గౌరవాన్ని గుర్తుచేసుకునే రోజు అని పూర్వం నుండి ఇప్పటి వరకు, ఎందరో మహిళలు ఎన్నో అడ్డంకులను ఎదిరించి, ఆత్మగౌరవంతో నిలబడి తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకుంటూ. శాస్త్ర సాంకేతిక రంగం నుండి అంతరిక్షం వరకు, క్రీడల నుండి రాజకీయాల వరకు... స్త్రీలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు అని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ మహిళలు కుటుంబం, సమాజం మరియు దేశ నిర్మాణంలో కీలక స్థానాన్ని కలిగి ఉన్నారని, విద్యార్థినులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది మరియు విద్యార్థినులను సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి,డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి,పద్మజ,డీన్ డాక్టర్ వి సుదర్శన్, టి పి ఓ డాక్టర్ రాజేష్, , ఎలక్ట్రికల్ విభాగం అధిపతి కృష్ణ ప్రసాద్, డాక్టర్ చార్యులు, సురేష్ పాల్గొన్నారు.